క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు మంగళవారం అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా కేదారేశ్వరస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ఉమా సమేత కేదారి స్వామివారు

పెదపూడి: మండలంలోని కైకవోలులో ప్రసిద్ధి చెందిన ఉమా సమేత కేదారేశ్వర స్వామివారి కల్యాణం మంగళవారం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని పండితులు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించి పరవశమయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు జరిపారు.

మండలంలో 85.52 శాతం పోలింగ్

పెదపూడి: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 85.52 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో మొత్తం 64 పోలింగ్ బూత్‌ల్లో 60,301 మంది ఓటర్లకు గాను 85.52 శాతం మేర 51,570 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వారిలో పురుషులు 25,658 మంది, మహిళలు 25,912 మంది ఓట్లు పోలయ్యాయన్నారు. మండలంలోని చింతపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్‌లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ జరిగిందని చెప్పారు. సీల్ చేసిన ఈవీఎంలను నన్నయ యూనివర్సిటీకి తరలించామని చెప్పారు.

యువకుడి ఫోన్ స్వాధీనం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి 116 పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తూ ఫొటో తీసుకున్న యువకుడి నుంచి ఎన్నికల అధికారులు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జనసేన పార్టీకి చెందిన చిక్కిరెడ్డి మునిప్రసాద్ తాను ఓటు వేసే సమయంలో ఫొటో తీసి వాట్సాప్‌లో షేర్ చేశాడు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకుడు, వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్‌తేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలింగ్ అధికారులు ఫోన్‌ను కోరుకొండ పోలీసు స్టేషన్‌కు పంపారు. సీఐ నాగమురళి ఫిర్యాదుతో పాటు ఎన్నికల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతుంది.

248 మందికి వైద్య పరీక్షలు


వేమగిరిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కడియం: వేమగిరి సచివాలయం 2 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 248 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు శిబిరం పర్యవేక్షకులు డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. డాక్టర్లు ఎస్.నాగసాయిమౌర్య, బి.సాయికరణ్, ఎం.అప్పారావు, డి.సాంబయ్యల ఆధ్వర్యంలో జనరల్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఆప్తమాలజీ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించామని, ఒకరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేసినట్లు చెప్పారు. శిబిరంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు సేవలందించారన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు

ధవళేశ్వరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగా విశేష అభిషేకాలు, కుంకుమ పూజ జరిపారు. మహిళా సమాజం ఆధ్వర్యంలో లలితా సహస్ర నామ పారాయణ జరిగింది.

కాలేరులో ఆరోగ్య సురక్ష శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కరుణేంద్రకుమారి ఆధ్వర్యంలో కాలేరు, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన రోగులకు చికిత్స అందించారు. ఆలమూరు సీహెచ్‌సీ వైద్యులు అభిలాష్, కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వైద్యులు శ్రావణి వైద్య సేవలందించారు. మోటారు వాహనంపై నిచ్చెనను తీసుకెళ్తూ అచ్యుతాపురం గ్రామానికి చెందిన వ్యక్తి పడిపోయాడు. నిచ్చెన విద్యుత్ స్తంభానికి తగలడంతో కిందపడి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని ఆరోగ్య సురక్ష శిబిరానికి తరలించగా, వైద్యులు చికిత్సనందించారు.

వెల్లివిరిసిన చైతన్యం

- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న యువత, మహిళలు, వృద్ధులు
- సోమవారం రాత్రి 10 గంటలకైనా క్యూలో నిలుచుని ఓటేసిన ప్రజలు
- అనపర్తి నియోజకవర్గంలో 86.23 శాతం పోలింగ్ నమోదు


అనపర్తిలో బారులు తీరిన ఓటర్లు


పెదపూడి మండలం రామేశ్వరంలో ఓటేసేందుకు క్యూ కట్టిన మహిళలు

అనపర్తి: ఐదేళ్లకోసారి వచ్చే ఓటేసే అవకాశాన్ని ఓటర్లు చేజార్చుకోలేదు. ఎక్కడెక్కడి నుంచో రెక్కలు కట్టుకుని మరీ సొంతూరులో వాలారు. ప్రయాణం భారమనుకోలేదు. ఎండను లెక్కజేయలేదు. ఇంటింటా ఓటర్లలో చైతన్యం విల్లివిరిసింది. యువత, మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు కదలి వెళ్లారు. చూపుడు వేలితో తమ భవిష్యత్తును నిర్ణయించే నేతను ఎన్నుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పోలింగ్ అధికారులు అప్పటికే క్యూలో ఉన్నవారందరికీ టోకెన్లు ఇచ్చి ఓటేసేందుకు అవకాశమిచ్చారు. ఓటర్లు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చినా వెనుదిరిగి వెళ్లకుండా ఓపికగా వేచి చూసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రంగంపేట మండలం వడిశలేరు, బాలవరం, పెదపూడి మండలం చింతపల్లి తదితర గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలోని రంగంపేట మండలం వెంకటాపురంలోని 144వ పోలింగ్ బూత్‌లో 1,004 మంది ఓటర్లకు గాను అత్యధికంగా 950 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 94.62 పోలింగ్ శాతం నమోదైంది. అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 4వ పోలింగ్ బూత్‌లో 1,063 మంది ఓటర్లకు గాను 706 మంది ఓటర్లు మాత్రమే ఓటేయడంతో అత్యల్పంగా 66.42 పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గంలో రంగంపేట మండలంలో 88.88 శాతం, అనపర్తి మండలంలో 85.41 శాతం, బిక్కవోలు మండలంలో 85.66, పెదపూడి మండలంలో 85.46 శాతం మంది ఓటేశారు. ఓటర్లలో చైతన్యం కారణంగానే ఈసారి ఎన్నికల్లోనూ అనపర్తి నియోజకవర్గంలో గణనీయంగా ఓటింగ్ నమోదైంది.

86.23 శాతం పోలింగ్ నమోదు

అనపర్తి నియోజకవర్గంలో 2,26,053 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,10,515 మంది, మహిళలు 1,15,535, ఇతరులు ముగ్గురు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 1,94,924 మంది ఓటర్లు ఓటేశారు. 96,161 మంది పురుషులు, 98,761 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో నియోజకవర్గంలో 86.23 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు. 2014 ఎన్నికల్లో నియోజకవర్గంలో 85.53 శాతం పోలింగ్ నమోదు కాగా, 2019 ఎన్నికల్లో 87.48 శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో 2,13,472 గాను 1,86,748 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే 2024 నాటికి నియోజకవర్గంలో ఓటర్లు 12,581కు పెరిగి మొత్తం 2,26,053కి చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు నేరుగా కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో కులాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా మహిళలు విధేయతతో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్న కామెంట్ సర్వత్రా వినిపిస్తోంది. అలాగే నెలా నెలా ఒకటో తేదీన తెల్లవారుతుండగానే వలంటీర్లు ఇంటి తలుపులు తట్టి మరీ వృద్ధాప్య పింఛన్ల సొమ్ము చేతిలో పెడుతున్న సానుకూల పరిణామం కూడా వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు రప్పించిందన్న అభిప్రాయం అందరి నుంచి వ్యక్తమవుతోంది. పైగా టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల్లో కోత తప్పదన్న భయం ప్రజల్లో నెలకొనడం సైతం ఓటింగ్ పెరగడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏయే గ్రామాల్లో ఎంతెంత మెజార్టీ?

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి క్షణం తీరిక లేకుండా గడిపిన అభ్యర్థులు ఓటర్ల మనసు గెలుచుకునేందుకు సర్వశక్తులు ఒడ్డారు. పోటీలో నిలిచిన అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటి ప్రచారంలో బిజీబిజీగా గడిపారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రచార హోరు, వర్గ విభేదాలతో గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం చల్లబడుతుంది. ఏయే బూత్‌ల్లో ఎవరికెన్ని ఓట్లు పడ్డాయో, ఏయే గ్రామాల్లో ఎంతెంత మెజార్టీ వస్తుందోనన్న లెక్కల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మునిగి తేలుతున్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థిని ఎదుర్కోవడం కోసం వ్యూహ ప్రతివ్యూహాలతో గడిపిన అభ్యర్థులు ఎన్నికలు పూర్తి కావడంతో తమ అనుయాయులతో ఎన్నికల సరళిపై అంచనాలు వేసుకుంటున్నారు. అయితే ఓటర్లు ఇచ్చిన తీర్పు కోసం అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

రాజానగరం నంబర్ వన్

- 87.53 శాతంతో జిల్లాలో ప్రథమం
- వెలుగుబందంలో రాత్రి 11.45 వరకూ జరిగిన పోలింగ్


కలవచర్లలోని పాఠశాల ప్రాంగణంలో రాత్రి 9 గంటల సమయంలోనూ వేచి ఉన్న ఓటర్లు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లలో చైతన్యం వెల్లువెత్తింది. ఆడ, మగ, ముసలి, ముతక అనే తేడా లేకుండా ఈసారి ఓటు చేసేందుకు అధిక శాతం మంది స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 7 నుంచి పోలింగ్ సమయం ముగిసే వరకూ ఓటర్ల రద్దీ కొనసాగుతూనే వచ్చింది. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం 87.53 శాతం ఓటింగ్ జరిగి, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. 2,16,491 మంది ఓటర్లకు గాను అర్ధరాత్రి 11.45 గంటల వరకు ఓటింగ్ జరిగిన వెలుగుబందతో సహా 1,89,505 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 87.53 శాతం ఓటింగ్ జరిగింది. దీనికి 1,531 పోస్టల్ బ్యాలెట్లు కలుపుకొంటే 88.24 శాతం పోలింగ్ జరిగింది.

పెరుగుతూ వచ్చిన ఓటర్లు

నియోజకవర్గ పునర్విభజన జరిగిన తరువాత జరిగిన ఎన్నికలకు సంబంధించి 2009లో 1,64,831 ఓటర్లకు గాను 1,42,552 మంది ఓటు వేశారు. 2014లో 1,87,185 మందికి గాను 1,60,,757 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక 2019లో 2,01,280 మందికి గాను 1,76,785 మంది ఓటు చేశారు. ఈసారి నియోజకవర్గంలో ఓటర్లు 2,16,491కి ఓటర్లు పెరిగారు. ఈ ఎన్నికలలో 1,89,505 మంది ఓటు చేశారు.

పోలింగ్ సరళి

సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రెండు గంటల్లోనే 7.91 శాతానికి చేరుకుంది. ఇదే క్రమంలో 11 గంటలకు 22.91 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 33.64 శాతం, 3 గంటలకు 54.16 శాతం, 5 గంటలకు 68.71 శాతం పోలింగ్ జరిగింది. నిర్ణీత సమయం సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత కూడ పోలింగ్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అప్పటికే ఆయా కేంద్రాలకు ఓటు చేసేందుకు వచ్చిన ఓటర్లకు సమయం ఇవ్వడంతో కలవచర్ల, నరేంద్రపురం, దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, జి.యర్రంపాలెం, తుంగపాడు, చక్రద్వారబంధలలో పోలింగ్ రెండు, మూడు గంటలు ఆలస్యమైంది. వెలుగుబందలో రాత్రి 11.45 గంటల వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది.

నిర్వహణ లోపాలు

ఆయా కేంద్రాల వద్ద నిర్వహణ పరమైన లోపాలు తలెత్తడంతో ఓటింగ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఉదాహరణకు సుమారు 21 గదులతో సువిశాలంగా ఉండే రాజానగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు ఏ ఎన్నికలు జరిగినా ఆ ప్రాంగణంలోనే మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఎన్నికలలో అంతటి సువిశాల ప్రాంగణం, సదుపాయాలు ఉన్న ఈ పాఠశాలలో ఎందుకనో ఒకే ఒక పీఎస్ ఏర్పాటు చేశారు. ఇరుకుగా ఉండే బీసీ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలలో రెండు పీఎస్‌లను ఏర్పాటు చేశారు. కలవచర్లలోని యూపీ పాఠశాలలో కూడా ప్రాంగణ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గ్రామంతా అదే ప్రాంగణంలో ఓటు చేసేవిధంగా మూడు పీఎస్‌లను ఏర్పాటు చేశారు. వచ్చిన ఓటర్లంతా కనీసం క్యూలో నిలుచోడానికి కూడా జాగా లేక రోడ్డు పైకి రావాల్సి ఇటువంటి ఏర్పాట్లకు తోడు ఎలక్ట్రానిక్ విధానంలో పార్లమెంటుకు, అసెంబ్లీకి ఒకేసారి రెండు ఓట్లు వేయాల్సి రావడంతో ఈవీఎంలలో వినిపించే బీప్ శబ్దం ఆలస్యం కావడం, వీవీపాట్‌లో ఓటరు వేసిన ఓటుకు సంబంధించిన చిత్రం కనిపించడంలో కూడా జాప్యం జరగడం ఓటింగ్ సరళి వేగిరంగా జరగకపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. మోడల్ పీఎస్‌లను ఏర్పాటు చేసి ఓటర్లను ఆకర్షించే విధంగా ఏర్పాట్లు చేశామని ప్రకటనలిచ్చారుగానీ క్షేత్ర స్థాయిలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పీఎస్‌లను మాత్రం సరైన జాగాతో ఏర్పాటుచేయలేకపోయారు.

స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రం

- నన్నయ వర్సిటీకి చేర్చిన పోలింగ్ సిబ్బంది
- తెల్లవారేవరకూ జరిగిన ప్రక్రియ


స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఫారాలు పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు బాలసుబ్రహ్మణ్యం, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గం నుంచి ఈవీఎంలు నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరేసరికి తెల్లారిపోయింది. ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం 6 గంటల వరకూ జరగాలి. ఆ సమయానికి లైన్‌లో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలి. పోలింగ్ సమయం దాటినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు క్యూలో ఉండడంతో వారికి స్లిప్‌లు ఇచ్చి ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యి పోలింగ్ కేంద్రాల నుంచి నన్నయ యూనివర్సిటీ రూట్ బస్సు చివరిగా మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు చేరుకుంది. ఎన్నికల సిబ్బంది ఈవీఎంలలో పోలైన ఓట్లు, ఫారం 17 రిజిస్టర్, పీవో డైరీ తదితర ఫారంలతో పాటు ఈవీఎంలు అప్పగించినప్పటికీ తెల్లారిపోయింది.

ఎక్కువ సమయం తీసుకోవడంతో..

నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఒక్కో ఓటు వేయడానికి ఎక్కువ సెకన్లు తీసుకోవడం వలనే పోలింగ్‌కు ఆలస్యం జరిగింది. ముఖ్యంగా కడియం మండలంలో మాధవరాయుడుపాలెంలోని చైతన్య నగర్, వెంకాయమ్మపేట, బుర్రిలంక, ధవళేశ్వరంలోని రెండు పోలింగ్‌బూత్‌లు, హుకుంపేట డిబ్లాకులో, కోలమూరులోని ఎంపీయూపీ స్కూల్లోని బూత్‌లలో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. దీనివల్ల ఈ సెక్టార్ పరిధిలో మిగిలిన పోలింగ్ బూత్‌ల ఎన్నికల సిబ్బంది సైతం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నన్నయ యూనివర్సిటీకి మొదటి బస్సు రాత్రి 8 గంటలకు చేరుకోగా, చివరి బస్సు మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు వెళ్లింది. ఎన్నికల సిబ్బంది నుంచి ఈవీఎంలు, ఇతర సామగ్రి తీసుకునే ప్రక్రియ కూడా మందకొడిగా సాగింది.

నియోజకవర్గంలో 72.99 శాతం పోలింగ్

నియోజకవర్గంలో 72.99 శాతంపోలింగ్ జరిగింది. 2,72,826 మంది ఓటర్లకు గాను ఈవీఎంల ద్వారా 1,99,145 మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,036 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అందరి సమక్షంలో..

రాజమండ్రి రూరల్ అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలు నన్నయ యూనివర్సిటీలోని నార్త్‌బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీల్ వేశారు. ఎన్నికల పరిశీలకులు బాలసుబ్రహ్మణ్యం, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, పోటీ చేసిన అభ్యర్థులు, వారికి సంబంధించిన ఏజెంట్ల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సుమారు 40 రోజుల పాటు బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు జరిగే జూన్ నాలుగో తేదీ కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో వివిధ సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్‌పోల్ సర్వేల్లో తమ నియోజకవర్గ ఫలితం అనుకూలంగా ఉందో లేదో అని తెలుసుకునే ప్రయత్నం చేశారు. పోలింగ్‌బూత్‌ల వారీగా లెక్కలను తెప్పించుకొని తమ గెలుపు ప్రభావం ఎంత ఉందని అంచనా వేస్తున్నారు. దాదాపు ఈ పరిస్థితి రూరల్, సిటీ నియోజకవర్గాలలోని ఇరు ప్రధాన పార్టీల అభ్యర్థులలో కనిపిస్తోంది. సర్వేలు చెబుతున్నా, తమ సొంత లెక్కలను సైతం చేసుకొని గెలుపుపై ఓఅంచనాకు వస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. సోమవారం రాత్రి పోలింగ్ ముగిసిన తర్వాత మంగళవారం ఉదయం నుంచే ఆయా అభ్యర్థుల నివాసాల వద్ద ముఖ్యనాయకులు, కార్యకర్తలు చేరుకుని, బూత్‌ల వారీగా లెక్కలపైనా సమీక్ష చేస్తుండడం కనిపించింది. ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.


గంటలకొద్దీ నిలబడి.. ఓటేసిన పండుటాకులు

రాయవరం: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఉదయం ఏడు నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడ్డారు. మండలంలో 53,108 మంది ఓటర్లు ఉండగా, 46,267 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహిళలు, వృద్ధులు సైతం గంటలకొద్దీ లైన్లలోనే నిల్చుని ఓట్లు వేయడం గమనార్హం. మండలంలోని పోలింగ్ సరళిని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. మండలంలో అత్యధికంగా నదురుబాదలో 93 శాతం పోలింగ్ జరగ్గా, అత్యల్పంగా చెల్లూరులో 84.36 శాతం ఓటింగ్ జరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 87.11 శాతం ఓటింగ్ జరగడంతో అన్ని వర్గాల్లో ఆనందం నింపింది. కురకాళ్లపల్లి పోలింగ్ కేంద్రంలో రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్ కొనసాగినా, మహిళలు వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధుల ఓట్లు కీలకం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. అధికారుల ప్రాథమిక సమాచారం మేరకు మండలంలో 12 గ్రామాల్లో ఓటర్లు పోలైన ఓట్లు శాతం ఇలా ఉంది.

నాడు దయనీయం..నేడు ధాన్యాగారం

- ఉభయ గోదావరి జిల్లాల ప్రస్థానం
- కాటన్ కృషితోనే సాధ్యం
- నేడు ఆయన జయంతి


ధవళేశ్వరంలోని కాటన్ విగ్రహం


కాటన్ బ్యారేజ్



ధవళేశ్వరం: తీవ్ర క్షామంతో అల్లాడుతున్న ఉభయగోదావరి జిల్లాలను ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం ద్వారా అన్నపూర్ణగా మార్చిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడు. అతివృష్టి, అనావృష్టిలతో అతలాకుతలమైన ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి ధాన్యాగారంగా మార్చిన ఘనత ఆయనదే.

ఆనకట్ట నిర్మాణ బాధ్యత

1839లో కోస్తా ఆంధ్రలో పెనుతుపాను, ఉప్పెన తాకిడికి సుమారు రెండు లక్షల మంది ప్రజలు మృత్యువాత పడటంతో బ్రిటిష్ ప్రభుత్వం స్పందించి కారణాలు తెలుసుకుని నివేదిక సమర్పించాలని కాటన్‌ను ఆదేశించింది. అప్పటికే తీవ్రమైన క్షామంతో అల్లాడుతున్న నదీ పరివాహక ప్రజలు గ్రామాలను విడిచి వలసలు వెళ్లి పోవడం ప్రారంభించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న కాటన్ ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మించాల్సిన అవసరం ఉందని అంచనా వేశారు. నీటిపారుదల పథకాన్ని అమలు చేసే బాధ్యతను బ్రిటిష్ ప్రభుత్వం కాటన్‌కు అప్పగించింది. గుర్రంపై సుదూర ప్రాంతం పర్యటించిన ఆయన గోదావరి నది స్వరూపం, నీటి లోతు, ప్రవాహ గమనం, ఏటిగట్లు, మెట్ట పల్లాలు, ఇతర నైసర్గిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి 1845లో ఒక నివేదిక సమర్పించారు. 1846లో ఆనకట్ట నిర్మాణానికి ఆమోద ముద్రవేశారు. 1847లో ఆనకట్ట నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.

నాటి సాంకేతిక పరిజ్ఞానం నేటికీ అద్భుతమే...

తాటిచెట్టు బోదులు, టేకు, సున్నపురాయిలతో నిర్మితమైన ఆనకట్ట సాంకేతిక పరిజ్ఞానం నేటికి అద్భుతమే. పదివేల మంది కూలీలు, 500 మంది వడ్రంగులు, 500 మంది కమ్మరులు ఆనకట్ట నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు. 1841 అక్టోబర్ 29న కాటన్‌ను వివాహం చేసుకున్న ఎలిజబెత్ ఆయనకు ఎంతగానో సహకరిస్తూ కూలీల పిల్లలకు విద్యాబోధన చేశారు. 1849లో బ్రిటిష్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు అందటంతో 1852 నాటికి ఆనకట్ట నిర్మాణాన్ని పూర్తి చేయగలిగారు.

అనేక ప్రాజెక్టులకు సలహాలు

కాటన్ సిఫారసుల ఆధారంగానే కృష్ణా, గంగ, తుంగభద్ర నదులపై ఆనకట్టలు రూపుదిద్దుకున్నాయి. పదవీ విరమణ అనంతరం 1860లో కాటన్ ఇంగ్లాండ్‌కు తిరిగి వెళ్లిపోయారు. అయితే పలు ప్రాజెక్టుల విషయంలో సలహాలు అందించేందుకు 1862, 63 సంవత్సరాల్లో ఆయన ఇండియా వచ్చారు. కాటన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం సర్', నైట్‌హుడ్ బిరుదులతో సత్కరించింది. 1899 జూలై 24న ఆయన కన్నుమూశారు. ఆయన నేటికీ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్మరణీయులు.

కాటన్ ప్రస్థానం

- ఇంగ్లండ్‌లోని కేంబర్ మిర్ ఏబిలో హెన్రీ కాల్వెలి, కాటన్ దంపతులకు 1803 సంవత్సరంలో పదో సంతానంగా ఆర్థర్ కాటన్ జన్మించారు.
- 15వ సంవత్సరంలోనే క్లాయిడన్ వద్ద అడిస్‌కోంబ్ సైనిక శిక్షణాలయంలో కేడెట్‌గా జీవితం ప్రారంభించారు.
- కాటన్ ప్రతిభను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం 1821లో మద్రాసులోని చీఫ్ ఇంజినీర్ కార్యాలయానికి పంపింది.
- 1829లో దక్షిణ భారతదేశంలో నీటిపారుదల సౌకర్యాలను అభివృద్ధి పరిచే పనిని కాటన్‌కు చేపట్టారు.
- 1836లో కొలరూన్ ఆనకట్ట నిర్మించి తంజావూర్ జిల్లాకు విశేష ప్రయోజనం చేకూర్చారు.
- 1837లో మద్రాసులో నౌకాశ్రయ నిర్మాణం చేపట్టి అనతి కాలంలోనే పూర్తి చేశారు.